బీరప్ప పండుగకు ఆహ్వానం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 20: మండలంలోని తమ్మడపల్లిలో మార్చి 7 నుంచి 10 వరకు కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బీరప్ప పండుగకు రావాలని గురువారం పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రపు బాలరాజుకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నేతలు మేకల రాజు, బేజాడి సిద్దులు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు గ్రామంలో అత్యంత వైభవంగా జరిగే బీరప్ప పండుగకు రావాలని ఆహ్వానించామని తెలిపారు. రాజు, మహేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

బాలరాజుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న కుర్మసంఘం నేతలు

సత్తయ్య కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన మానేపల్లి సత్తయ్య ఇటీవల మృతిచెందగా కట్కూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తోటి విద్యార్థులు గురువారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబం కావడంతో తమవంతుగా రూ.15,500 అందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన రాంప్రసాద్

రాంప్రసాద్

జనగామ రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని వడ్లకొండలో గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థి నామాల రాంప్రసాద్ కబడ్డీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎండీ సలావుద్దీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్‌లో జరిగిన సబ్ జూనియర్ సెలక్షన్ కబడ్డీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 20, 21, 22, 23 తేదీల్లో వికారాబాద్‌లో జరిగే 34వ సబ్ జూనియర్ బాలుర విభాగంలో జిల్లా తరపున పాల్గొంటారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

దొంగకు దేహశుద్ధి

కాజీపేట, ఫిబ్రవరి 20 : కాజీపేటలోని ఓ చర్చిలో చోరీకి వచ్చిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన ఘటన గురువారం జరిగింది. బాపూజీనగర్‌లోని ఫినెట్ బాప్టిస్ట్ చర్చికి వాచ్‌మన్ బుధవారం తాళం వేశాడు. అర్ధరాత్రి తర్వాత చర్చి ఆవరణలో కుక్కలు అరవడంతో బయటికి వచ్చాడు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి చర్చిలోకి వెళ్లి చోరీకి యత్నిస్తున్నట్లు గమనించాడు. స్థానికుల సాయంతో పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★45 చ.గ.ల G+2 ఫర్నీషింగ్‌తో క్లియర్ టైటిల్ గలది. మెయిన్ రోడ్‌కు దగ్గరలో, రెనాల్డ్ స్కూల్ ఎదురుగా, ఎయిర్‌పోర్ట్ రోడ్, శంభునిపేట్, వరంగల్. సెల్: 9391565095/W: +18474431516.

NTW-6554

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

వేసవి ప్రణాళికలు రూపొందించాలి

సమీక్షలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 20: వేసవికాల ప్రణాళికను అధికారులు రూపొందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ వేసవి కాలంలో నీటి ఎద్దడి, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లపై అధికారులతో జూమ్‌మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా జిల్లా ప్రజలకు తాగునీటి, సాగునీటి సమస్య తలెత్తకుండా ఈనెల 28వ తేదీలోగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోర్ల ఫ్లషింగ్, పైపులైన్ మరమ్మతులు ముందుగానే చేపట్టాలన్నారు. మున్సిపల్ వార్డులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత రాకుండా తాగునీటి ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్, బ్లీచింగ్ చేయాలని తెలిపారు. క్లోరినేషన్, తాగునీటి సరఫరా, పైప్‌లైన్ మరమ్మతులు, బ్లీచింగ్ నిల్వ, ఫిర్యాదుల రిజిస్టర్లను మెయింటేన్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాలోని కుటుంబాల వివరాలు మరోసారి పరిశీలించాలని తెలిపారు. ఈనెల 28లోగా తుది జాబితా పూర్తిచేసి ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఇంటి పన్ను, నల్లా పన్ను వసూళ్లు 83 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మార్చి 5వ తేదీ వరకు వంద శాతం వసూలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. పేదలకు వంద రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి సంచుల్లో విత్తనాలను నాటాలని తెలిపారు. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టాలని సూచించారు. ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలు, శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాలను అధికారులు సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. అంతకుముందు స్త్రీనిధి రుణాల రికవరీపై అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీఆర్డీవో వసంతతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రికవరీలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి నిర్మాణం కోసం ఇటుకల తయారీ యూనిట్‌పై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఇందిరా మహిళా క్యాంటీన్ నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ యూనిట్లు రఘునాథపల్లి, పాలకుర్తి మండలాల్లో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం పీడీ చంద్రశేఖర్, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి 25 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4251 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4694 మంది కలిపి మొత్తం 8945 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహాయించి ఏ ఒక్కరి వద్ద సెల్‌ఫోన్ ఉండేందుకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే టెలీ మానస్ లేదా టోల్‌ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని తెలిపారు. కలెక్టరేట్‌లోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డీఐఈవో జితేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు, డీఈవో రమేశ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు: కలెక్టర్

ధర్మసాగర్‌లోని జ్యోతిరావు పూలే గురుకులంలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

స్టేషన్ ఘన్‌పూర్: తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దని, విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యమని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవోలు, మండలాల ప్రత్యేక అధికారుల రాత్రి బస చేశారు. కాగా స్టేషన్ ఘన్‌పూర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, నమిలిగొండలోని మైనార్టీ గురుకులంలో డీపీవో స్వరూపారాణి రాత్రి బసచేయగా నియోజకవర్గ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల, కళాశాలలో కలెక్టర్ బస చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఉదయం వాటర్‌ప్లాంట్, కిచెన్, గార్డెన్, వంటశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం అల్పాహారం వంట తీరు పరిశీలించి, విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని సాధించి, తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని సూచించారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పది జీపీఏ సాధించేలా కృషి చేయాలని, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తెచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మాజీ ఎంపీటీసీ అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 20: మండలంలోని తమ్మడపల్లి(జీ)కి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు మారేపల్లి మధుకర్ అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య గ్రామానికి చేరుకుని మధుకర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

జేసీబీతో కందకాలు తవ్విస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు, ఫిబ్రవరి 20 : మండలంలోని ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జనగామ రూరల్, రఘునాథపల్లి సీఐ ఎడవల్లి శ్రీనివాస్, చిల్పూర్ ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ హెచ్చరించారు. గురువారం చిన్నపెండ్యాల ఆకేరువాగులో ఇసుక అక్రమంగా తరలించకుండా రహదారికి అడ్డంగా జేసీబీతో కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్కల్, చిన్న పెండ్యాల, రాజవరం, వెంకటాద్రిపేట, మల్కాపూర్, లింగంపల్లి, శ్రీపతిపల్లి వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక రవాణాతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోతున్నాయని వివరించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బాధ్యత కేంద్రానిదే

- పార్లమెంటులో వెంటనే బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధులతో నిర్వహించారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు చట్టబద్ధత కల్పించేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి వారి నిబద్ధత చాటుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. మార్చి 15లోగా ముఖ్యమంత్రి చేతులమీదుగా నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన సుమారు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు సుమారు 50వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్యా శిరీష్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య పాల్గొన్నారు.

లిక్కర్ మార్ట్‌లో చోరీ

రూ.43వేల నగదు, 2 మద్యం ఫుల్ బాటిల్స్ అపహరణ



లిక్కర్ మార్ట్‌లో చోరీ చేస్తున్న దుండగుడు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న 'జనగామ లిక్కర్ మార్ట్'లో బుధవారం అర్ధరాత్రి 2గంటలకు చోరీ జరిగింది. గురువారం ఉదయం మార్ట్‌ను ఓపెన్ చేసిన నిర్వాహకుడు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న లిక్కర్ మార్ట్ పైకప్పును కట్ చేసిన ఇద్దరు దుండగులు లోపలికి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉన్న రూ.43వేల నగదుతోపాటు రెండు మద్యం ఫుల్ బాటిల్స్ ఎత్తుకెళ్లారు. మార్ట్‌లోని సీసీ కెమెరాల్లో ఆ ఇద్దరు దుండగుల కదలికలు రికార్డు అయినట్లు క్రైమ్ ఎస్సై భరత్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో వినతిపత్రంతో పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 20: జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌తోపాటు చంపక్ హిల్స్‌లోని ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డ్స్, పేషెంట్ కేర్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో వాటా ధనం కాంట్రాక్టర్ ప్రతి నెల జమ చేయాలన్నారు. పది నెలలుగా కార్మికులకు పీఎఫ్ జమ చేయడం లేదని ఆరోపించారు. విధుల్లో ఉన్న మహిళా కార్మికులు డ్రెస్ మార్చుకునేందుకు గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, మాస్కులు, శానిటేషన్ సబ్బులు, యూనిఫామ్, గ్లౌజ్‌లు, షూస్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దిరామ్ దయాకర్, నాయకులు రఘు, అజయ్, సువర్ణ, రజిత, బాలమణి, మంజుల, స్వరూప, యాదలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ప్రమాద బీమా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

టీఎస్‌జేయూ సభ్యులకు బీమా పత్రాల పంపిణీ

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 20 : టీఎస్‌జేయూ రాష్ట్ర కమిటీ తరపున జనగామ జిల్లా సభ్యులకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా పత్రాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదాలకు గురయ్యే జర్నలిస్టుల కుటుంబాలకు ఈ బీమా సౌకర్యం చేదోడుగా ఉంటుందన్నారు. టీఎస్‌జేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలంచి నరేందర్, బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, జిల్లా జర్నలిస్టులు కొన్నె ఉపేందర్, చిల కిరణ్‌కుమార్, ఎం.శివకుమార్, రాజు, నవీన్‌చారి, ఓంకార్, అఫ్రోజ్, కార్తీక్, వినోద్, లక్ష్మయ్య, పాండు, దేశాయ్‌రెడ్డి, అంజయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెదమడూరు పాఠశాలలో 'స్వయం పాలన'



'స్వయంపాలన' విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరుప్పుల, ఫిబ్రవరి 20: మండలంలోని పెదమడూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠశాలను స్వయంగా నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితోపాటు కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, సిబ్బందిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులు కిరణ్‌కుమార్, చరణ్‌పాల్, జస్సిక, సహస్రను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మరాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ధైర్యం కల్పించేందుకు స్వయం పాలన దినోత్సవం తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, ప్రతాప్, సత్యనారాయణ, రోజా ఉన్నారు.

చోరీలు చేస్తున్న నిందితుడి అరెస్ట్

నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 20: జనగామ పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామ మండలం మరిగడి గ్రామ సమీపంలోని కోటగుట్ట తండా (ప్రస్తుత జనగామ వీవర్స్‌కాలనీ ఏరియా)కు చెందిన బానోత్ కిరణ్ స్థానిక గ్రేన్ మార్కెట్ యార్డులో హమాలీ పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణ, జల్సాలకు డబ్బులు సరిపోక రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలోకి ప్రవేశించి చోరీలు చేసేవాడు. ఈనెల 18న రాత్రి 11.30 గంటలకు పాత బీటు బజారులో తాళం వేసి ఉన్న ఓ రేకుల ఇంట్లో చొరబడి రూ.1500 చోరీ చేశాడు. 2022 సంవత్సరంలో పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న ఓ వ్యాపార సంస్థలో నుంచి రూ.25వేలు చోరీ చేశాడు. గురువారం నెహ్రూపార్కు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు వివరించారు. పోలీసు విచారణలో నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ దామోదర్‌రెడ్డి, క్రైమ్ ఎస్సై ఎం భరత్, కానిస్టేబుళ్లు రమేశ్, అరవింద్, సురేశ్‌ను డీసీపీ రాజమహేంద్రనాయక్ అభినందించారు.

కర్ణాలకుంట ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చిల్పూరు, ఫిబ్రవరి 20 : కర్ణాలకుంట భూమి ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు నారబోయిన కనకరాజు కోరారు. మండలంలోని రాజవరంలో గురువారం ముదిరాజ్ సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. గ్రామ సమీపంలోని కర్ణాలకుంటలో నీటిలో ముదిరాజ్‌లు చేపలు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. కుంట కట్టకు గండి కొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల గ్రామానికి చెందిన తీగల మహేందర్ కుంటకు గండి కొట్టడంతోపాటు భూమి కబ్జా చేశాడని ఆరోపించారు. దీంతో నీరంతా వాగు నుంచి రిజర్వాయర్‌లోకి వెళ్లిందని, ప్రస్తుతం వేసవి ప్రారంభం కాకముందే భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. ఈ విషయంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ముదిరాజ్ సంఘం సభ్యులు ఈర్ల కనకరాజు, నారబోయిన సదానందం, నారబోయిన సారయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు ఈర్ల రాజేందర్ నారబోయిన రాజ్‌కుమార్, ఈర్ల కనకరాజు, నారబోయిన శంకర్, రాజు, నాయిని గణేష్, రాజు, శ్రీరాముల కరుణాకర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం, నూకలు పట్టివేత

హసన్‌పర్తి, ఫిబ్రవరి 20 : మండలంలోని వంగపహాడ్‌లో అక్రమంగా నిల్వచేసిన 16 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, 23 క్వింటాళ్ల నూకలను హసన్‌పర్తి పోలీసులు గురువారం పట్టుకున్నారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. వంగపహాడ్‌కు చెందిన ముల్కలపెల్లి రాజు, తెట్టె రవి, తెట్టె నాగరాజు, ముల్కపెల్లి సుజాత రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని నూకలుగా చేసి ఎక్కువ ధరకు కోళ్లఫామ్‌లకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న హసన్‌పర్తి పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం, నూకలు పట్టుకుని, ఒక ఆటో సీజ్ చేసి, నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కనువిందుగా మోదుగ పూలు

మోదుగ చెట్లు పూలతో కనువిందు చేస్తున్నాయి. మోదుగ చెట్లు ఆకు రాల్చి పూలతో నిండిపోయాయి. నెల రోజుల్లో హోలీ పండుగ ఉండగా పూలు ఆకట్టుకుంటున్నాయి.

– జనగామ రూరల్, ఫిబ్రవరి 20

పోటీల్లో ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 20 : హనుమకొండ నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు కబడ్డీ, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు పందెం మొదటి స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. గురువారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆమె అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, క్రీడావిభాగం అధ్యాపకుడు భాస్కర్, శ్రీదేవి పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రి పంపిణీ చేసిన స్వరాజ్ ఫౌండేషన్ సభ్యులు

ప్రభుత్వ కళాశాలలో 'గిఫ్ట్ ఏ స్మైల్'

కొడకండ్ల, ఫిబ్రవరి 20: స్వరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన ప్యాడ్‌లు, పెన్నులు, ఇంగ్లిష్ డిక్షనరీలు ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఫౌండేషన్ చైర్మన్ రాజేశ్‌నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకుడు మాలి అశోక్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ జాంబనాయక్, వీరేష్‌నాయక్, వీరన్న బాలాజీ, రోహిత్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ లక్ష్మీనారాయణ

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

జనగామ డీఈ లక్ష్మీనారాయణ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 20: గ్రామాల్లోని రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జనగామ డీఈ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలోని ఆలీంపూర్, బండనాగారం, నారాయణపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కొద్దిరోజులుగా గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య ఏర్పడుతున్నందున అవసరమైన చోట ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి ఇక నుంచి నాణ్యమైన విద్యుత్ అందుతుందని పేర్కొన్నారు. ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, విద్యుత్ సిబ్బంది సారయ్య, బాలరాం, జలందర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, కాంట్రాక్టర్లు ముశిని రాజుగౌడ్, భానుచందర్ పాల్గొన్నారు.

ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ఫౌండేషన్ బాధ్యులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 20: మండలంలోని ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 33 మంది పదోతరగతి విద్యార్థులకు చైత్ర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వీజీఎస్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. ఇందుకు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లంకొండ సునీత కృష్ణారెడ్డి, కుమారుడు శశిధర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఆర్థిక సాయం అందించిన దాతలు సునీత కృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం పరహత్ కౌసర్, బెల్లంకొండ సునీత కృష్ణారెడ్డి, గాదెపాక భాస్కర్, ఉపాధ్యాయ బృందం వెంకటపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్, కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.